స్కెచ్

# మల్లె మొగ్గలు

రత్నం

ఏప్రిల్ నెల మండువేసవికి సంబంధించిన ఒకనాటి మిట్టమధ్యాహ్నము. ప్రదేశము మా అద్దె గృహపు వసారా చావిడి. గాడుపు విపరీతంగా వస్తోంది. ఈ దుర్భర సమయాలను వెళ్ళబుచ్చుటకు మా ఇంటి మొత్తములో తూర్పువైపుగా వున్న ఈ చావిడియే ఉత్తమమైనదిగా నాచే ఎంచబడుట, సతీమణిచే ఆమోదించబడుట కూడా జరిగాయి. కునుకుపాట్లు పడుతూ పేపరు చూస్తూ పడక కుర్చీలో వేసవి తాపాన్ని అనుభవిస్తున్నాను. నా ప్రక్కనే గోడకు ఆనుకొని శ్రీమతి శారద, నెల నిండిన చిన్నారిపాప, అనగా మా తృతీయ పుత్రిక, కొరకై తంటాలుపడుతూవున్న అల్లిక మేజోళ్ళ పనిలో నిమగ్నమై వున్నది. ఎండ అంతగా మండిపోతూవున్నా, అదేమి మాయయో గాని, చిన్న పిల్లలకు మాత్రము నిద్రరాదు. భగవానుని చిద్విలాసములలో అది ఒకటియై యుండనోపు! మా ఏకైక సుపుత్రుడు గోపాలం తన మొదటి ఇద్దరి చెల్లెండ్రతోను వాగ్వివాదములలో పడి తను బాధపడుతూ వాళ్ళను అవస్థపెడుతున్నాడు. వాని మూడవచెల్లెలు మాత్రము ఈ కలహాములలో ఇసుమంతయు జోక్యము కలుగచేసికొనక, తన తల్లి మెడచుట్టూనే ఆటస్థలాన్ని పరిమితంచేసికోడానికి పోతే, తన క్రీడారంగమును ఇతరులు ఆక్రమించేస్తున్నారనో ఏమో, చిన్నారి పాప గొల్లుమంటోంది. చెపితే అర్థంకాని ఈ చిన్న పిల్లలు చేసే సహింపరాని గోలను వోర్పుతో భరించడంతప్ప మరేమి చేయగలం!

ఈ పరిస్థితిలో నేను సతమత మవుతూవుండగా రోడ్డుమీద "మల్లెమొగ్గలు, మల్లెమొగ్గలూ!" "ఐస్‌ఫ్రూట్!" అనే కేకలు ఒకేసారి మా అందరకూ వినిపించాయి. ఇక మా వసారాలో కలిగే చలనాన్ని ఇట్టే వూహించుకోవచ్చు. ఆ చలనాల ఫలితంగా మల్లెమొగ్గలమ్మేవాడు, ఐస్‌ఫ్రూట్‌వాలా మరుక్షణంలో మా వసారాముందు ప్రత్యక్షమయ్యారు. శారద మల్లెలు శ్రద్ధగా లెక్కిస్తోంది. గోపాలం, సోదరీమణులు ఐస్‌ఫ్రూట్ చీకుతున్నారు. అది చూస్తోంటేనే కరగిపోతోంది. ఆపసిపాపల అమాయక హృదయాలు, కనుపిస్తోనే మాయమయే ఐస్, ఎన్నాళ్ళకు నాకు నిండుజీవనం వస్తుందని ఆశతో నేలమీద ఎదురుచూసే మేజోళ్ళు—ఇవన్నీ ఏకకాలంలో నా మనోవీధిలో మెరసి, ఏవోవింత అనుభూతులను కలిగించేయి. ఆఫీసునుండి డబ్బు ఇంటికిరావడం వాళ్ళ అమ్మ మేజోళ్ళు అల్లడమంత కష్టమనీ, ఆ డబ్బే ఇంట్లోనుండి బయటికిపోవడం ఐస్ కరుగుటవలె అతి సులభమనీ,ఆ పసిహృదయాలకు ఏలాఅర్థమౌతుంది!

"ఏమండోయి! ఈ అబ్బికి అర్థరూపాయి ఇవ్వండీ! మొగ్గలు విడిపోతున్నాయి నిన్నటివి కలపివుంటాడు. అయినా వందబేడకు తక్కువ ఇవ్వలేదు"—అనే శ్రీమతి మాటలు నా ఆలోచనలను ఛేదించి ఈ లోకంలోనికి తెచ్చి నన్ను పడవేసేయి. అతనికి డబ్బులిచ్చి పంపివైచిన తరువాత నా మనస్సు మల్లెమొగ్గల మీదికి పోయింది. ఆ పోవడం పోవడం ఎనిమిది సంవత్సరాల వెనుక, వేసవిలో ఒకనాటి మధ్యాహ్నపు అపూర్వానుభవాన్ని జ్ఞప్తికి తెచ్చేయి.

ఆనాడు శారద నా మరదలు మాత్రమే. కాని మా ప్రేమానుబంధములు నాటినుండి నేటివరకు విడివడని అమరబంధములుగానే వున్నాయి. ఆ రోజు మధ్యాహ్నము ఎప్పటివలనే మామయ్యగారింటికి పోయాను. అందాలుచిందే మా చిట్టి మరదలు కంటికి కగుపించడమే అబ్బురమైపోయేది. నన్నుచూసి ప్రక్కగదిలోనికి పారిపోతూవుంటే చెయ్యి పట్టుకొని హాలులోనికి తీసుకవచ్చాను. "ఫో, బావా!" ఈ మాటలు సిగ్గులొలకబోసే మోమునందు ఎర్రగులాబీలను పరిహసిస్తూ ప్రకాశించే పెదిమలనుండి ముత్యాల్లారాలేయి. ఇంతలోనే మల్లెమొగ్గల కేకవినపడింది. శారద వెంటనే

వీధిలోనికి పరుగెత్తి, వానిని హాలులోనికి పిలుచుకొనివచ్చింది. ఏరి ఏరి ఐదువందల మొగ్గలుకొని, డబ్బులు తీసిఇచ్చి అతనిని పంపివేసింది. ఆ మల్లెలన్నీ వెండిపళ్ళెరంలో పోసుకుని, తిరిగి ఏరిఏరి "మృదుల సౌరభములీను" సొగసైన మొగ్గలను తన మృదులహస్తాలతో నాకు సమర్పించుకొంది. నాకు మల్లెలంటే ప్రాణమని శారదకు బాగా తెలుసు. అవి నాకు ఇవ్వడంలో ఆమె పొందే దివ్యానుభూతి, అపారమగు ఆనందము ఆమె చిరునగవులే వ్యక్తపరచేవి. ఆరోజునుండీ నేటివరకూ, మల్లెమొగ్గలు—స్వచ్ఛందతకు, నిర్మలత్వానికీ, పరిమళమునకూ తమకుతామే సాటిఅయిన మల్లెమొగ్గలు—మా ప్రేమకు శాశ్వతచిహ్నంగా నిలచిపోయాయి.

అసంభవమైనా, మల్లెమొగ్గలు మొగ్గలుగానే వుండిపోవాలనీ, విడిపోయి రేకలుగా రాలిపోరాదనీ, ఎప్పటికీ నేను వాంఛిస్తూనే వుంటాను.

---

# మబ్బు గుబ్బెత

దూరాలై కనిపించని ఆకాశపు సుందరతర తీరాలకు
భారముగా గర్భిణిలా మంద మంద గమనంతో
విలాసాలు, వినోదాలు వెలికిదీసి ఒలకబోసి
లావణ్యసుధా బిందువులు చిమ్మి పయనించే
మబ్బు గుబ్బెతకు పరశ్శతముగ నమోవాకములు
వాణీకంకణక్వాణ ముఖరిత వీణా మనోజ్ఞ
మధురగీతికా పాళిలు నీ అంతరమున ధ్వనించి,
సాంధ్యరాగ కిర్మీరిత నీలనభోంచలములపై
వెలిగిన వెలుగులు దువ్వలువలుకా బహుధా ధరించి,
వేల్పుల నేలలలో నీ వీలపాట పాడుచు హే
వాకముగా షికారులకు పోవుట నే నెఱుంగుదును
మబ్బుపడతి! నమస్తే!
శిల్పుల ఉలి వాదరలోనున్న తైక్ష్ణ్యతా భావము,
చిత్రకారు కుంచెలోని సూక్ష్మజీవకాంతిరేఖ,
నా కలమున కలవో లేవో నే నెరుగను—
నీ కడగన్నుల వెలుగుట నేను నేడె తెలిసికొంటి
అంజనగిరి చూర్ణ ప్రతిపక్షీ! అమృతోప మాన
వాఃకంకణశుక్తి కలిత కుక్షీ! హేదయార్ద్రాక్షీ!
నీ చనుత్రోవలలో నిలిచిన నిలింపుల వెలందుల
నిబిడనీల దృక్కాంతులలో—అమృతాంధసుల మనో
దర్పణములలో—నీ ప్రతిబింబమును చూచుకొనుచు, మురిసిపోదువీవు
సుడిగాలికి జడిసిపోయి, నడికడలిని తూలిపోయి
బుడిబుడి కన్నీరు కార్చి, జడియకు! అంతస్థిమితార్చి!
నీటికన్న తేలికయై, ద్రవణశీలివై పోయిన
నీ గుండెలు పదిల పరచుకో, నీ కన్నులు తుడిచి తెరచుకో
నీ సుదీర్ఘ పథములలో నీ వెనుకనెవచ్చి, కనులు
మూసి, ప్రణయగర్భితాట్ట హాస విచలితాఖిల కకుబంతమూర్తి,
వరుణుడు తనలో చేర్చును! ఉరు విరహాగ్నిని తీర్చును!

—వజ్రపాణి